జ్యోతి కథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ

# ఓరా! అడివా!

గోవిందునరసింహారావు

"ఒద్దు సార్! డ్రెస్సులో ఉన్నాను."

"కామరాజో! పిరికిమాట లాడతన్నావేటి? పొయిబీస నున్న రోజుల్లోనే మన కద్దులేదు గదా, యియ్యాలేటి నీకు బయ్యం? మందుచ్చుకోని పోలీసోడూ, లంచముచ్చుకోని రెవిన్యూవోడూ మందులోకేనా లేడయ్యా బాబో! అదెరికే గదా! కసింత పత్తెంగా తీసుకొని గాని దూటి కెళ్ళినావంటే—నాసామి రంగా—పులి పులిలాగుంటావుకదయ్యా! రా! కూకో! కసింపేస్లే పోనీ, పీకల మొయ్యావొద్దు."

"నిజవే గాన్సార్, మా యినస్పెక్టరు ఊళ్ళో లేడు గాన్సార్, ఒద్దుసార్."

"ముండింటికాడా, మందుకొట్టుకాడా మొకమాటం పనికిరాదయ్యా పోలీసోడా! అదెరికే గదా! రా, రా."

"అది నిజవే గాన్సార్, మా సూపరెంటు ముండాకొడుకు మా చెడ్డ కడుపుడుకు మనిషి సార్! నాలుగ్ పెగులు లాగించేసి—పెళ్ళాం పక్కలోంచి లేచొచ్చేసి పట్టీసుకుంటాడు సార్! అందులో యీ యినస్పెక్టరు వచ్చిందగ్గర్నుంచీ రేటు ప్రకారం స్టేషన్ మామూళ్ళోటి అందడం లేదు. అందుకని మరీ గుర్రుతున్నాడు. లేకపోతేనా......."

"ఓరమాయకుడా? నువ్వు పోలీసోడివా? పంతులివా? నీ ఉజ్జోగంలో యింకోడికి బయపడ్డం ఉంటాదా? కాదూ కూడదూ అంటే మాలాటి పెద్దోళ్ళ దగ్గరలా క్కసింత కనిపిస్తారు గాని. ఏటంతావు? రవిట్నా? రా కూకో!"

శ్రీకాకుళం పెద్ద పట్నంగాదు.

అలానే "శాంతి విహార్" పెద్ద హోటలు గాదు.

శ్రీకాకుళం బతుక్కి విశాఖపట్నం అందదు—ఎమ్మెల్యేలు ఓటరుగాడి కందనట్లు. అదంత పెద్దది.

అలానే విశాఖపట్నం బతుక్కి యే బొంబాయో, ఢిల్లీవో అందకపోవచ్చు. సెంట్రల్ లీడర్లు, ఎమ్మెల్యేల కందనట్లు.

అలానే బలద బతుక్కి శ్రీకాకుళం ఊపిరి సలపనివ్వనంత పెద్దది. ఓటు లేనివాడికంటే ఉన్నవాడికి లాగానే!

అందుకే—శ్రీకాకుళం పేరు తల్చుకుంటే చాలు—వరసపెట్టి నాలుగు పెగ్గులు దిగించీసినంత కిక్కందుకుంటుంది — సింహాద్రి నాయుడికి.

"మన సివాకోలం అన్ని యవ్వారాలకీ కసింతటూ యిటూగా తూగతందిగాని—కామరాజో—ఒక్కటంటే ఒక్కటికాడ మాత్రం బేక్వర్డయిపోతుందయ్యా!" అన్నాడు నాయుడు—పుచ్చుకున్న మందు క్వాలిటీని ముంచుకొచ్చే చుట్టపొగ సర్టిఫై చేస్తుండగా!

చిన్నగా నవ్వేశాడు—మొదటి పెగ్గుకి కన్నెరికం చేస్తున్న కామరాజు.

"అది గాదయ్యా కామరాజో! మనసిప్పి మాటాడేస్తున్నాను—మరేటనుకోకు గానీ—మనకి మరీ యిజానగరాలు, పెద్దాపురాలంత పెద్ద పరుగులొద్దు ఏటి? ఒద్దనే నానూ అంతాను. మాంసం తింటున్నామని వెమికలు మెళ్ళో ఏసుకు తిరగలేం గదా! ఏటి? అర్థమయిందా? కాని—మన జిల్లా ఓల్డు మొత్తం తాగుతుకి తగ్గట్టు మన సివాకోలం ఉండాలంటావా? అక్కర్లేదంటావా? అద్చెప్పు పోనీ! పక్కనున్న పర్లాకిమిడి, నిన్న మొన్నటి

పార్వతీపురాలముందు మనూరు తలెత్తుకు తిరగాలా? వద్దా? ఆ పేంతాల నుంచొచ్చిన నాయుళ్ళముందు మనం నిలబడాలా! వద్దా? సిగ్గేస్తుందయ్యా బావో! అదీ నా బాద! హాసు పత్రి నేకపోతే వొయిజాగెల్తాం. కలిక్టీరాపీసు నేకపోతే యిజానగరం పోతాం. లేదూ మరో ఊరు పోతాం. తగువునేదు. కొంపలేం మునిగి పోవు. కాని ఈ దిగదుడుపు బతుకుందే— సస—దీన్ని భరించలేమయ్యా! అక్కడికీ మన గవురమ్మకి సెప్పినాను—మంచి గుంట కావాలంటే మొహం వోసిపోతన్నాం—కావా లంటే మరో బేడో సావలో తీసుకో గాని— యీ కక్కుర్తి నంజల్ని మాత్రం తగిలించీక అని. ఆ ముండ కెంతసేపూ కలింగపట్నం సేవల్లంజలే దొరుకుతారు నాసుంది. అల్లకంటే బట్టాండుకాడ అడుక్కునే ముండలు నయం' అసలు—అసలు యిది మీ డిపోమెంటికే సిన్నతనమయ్యా! యెవుడికైనా తెలిసిందంటే- అక్కడి పోలీసోల్లేటి గాజులు తొడిగించు కుర్చున్నారా అని మిమ్మల్నీ—అక్కడ మీసమున్న మొనగాడే నేడేటి అని మమ్మల్నీ బూతులు తిడతారయ్యా—బూతులు-అదెరికేనా పోసీ?"

"చంపీసేరు సార్! అది పచ్చి నిజం. మా యినస్పెక్టరొట్టి వెధవన్నంత నిజం సార్."

"ఒప్పుకుంతన్నావుగదా! నాను సిమ్మాద్రి నాయుడ్నే గావచ్చు. మనకి మనూళ్ళ రంభ లాంటి ముండుండొచ్చు. కాని తెల్లారి నెగిస్తే మన బతుకు సివాకోలంయెగదు! ఇక్కడంటే మరి మందుకి—ముక్కకి కరువు నేదు గదా! ఆ తర్వాత దాని వొయినమేటీ అని? తాంబోళం లేని భోజనంల రుసేటుందయ్యా పోలీసోడా? పొగలు సంగతి బాదకదయ్యా! మరి రేతిరి మాటేటీ అని? దోమల్ని తోలుకుంటూ లాడ్జిం గుల జాగారం సెయ్యాల. నేదూ—ఆ గయి రమ్మ ముండకి వొర్తమానించాల. అది ఆర్నెలకితం తానమాడిన పగుద్రు లంజెల్ని తగిలించేస్తాది. తెల్లార్లూ ఆ సెండాలం మింగ లేక అదో సావు సావాల. రవిట్నా?"

"రైటామరి రైటాసార్! ఆడెవడో సెప్పి నట్టు యీ ఊరేటి మరీ అడివిలాగుందని డూటీల జాయినయినకాడ్నుంచీ మాసెడ్డిదై పోతాన్నానంటే నమ్మండి. బెల్లం వండిన పొయ్యిలంగదా! అయితేటి సెయ్యడం? మా యినస్పెక్టరొట్టి రూళ్ళకర్ర మనిషి-పెళ్ళాంతో సరసం చెయ్యడానిక్కూడా ఆడు రూలు ప్రకా రమే పోతాడు. గాంధీవో నెహ్రూవో కల్లోకి పారొచ్చి తిడతారేమోనని ఆడి బయ్యం— ఆళ్ళకి మరో పని లేనట్టు—ఈడ్ని తిట్టడమే ఆళ్ళ డూటీ అయినట్టూ. పిరికి నాయాల! ఆడితో ఒక సావు గాదంటే నమ్మండి.అయితే ఆడితో మనకేటి అని జల్దుకోకూడదా అని మీ లాటి పెద్దోళ్ళు అనొచ్చు. ఈ ఊరికి మన దింకా కొత్త కాపరం. జోరుకుంటే బాగుం డదు గదా! అందుకని సూత్తన్నానుగాని—లేక పోతేనా? అయినా కామరాజు సంగతి మీకు తెల్దేటి? అడివంటున్నారే మీరు—ఆ ఈ ఊళ్లో —రెండు మూడు క్లాసైన కంపెనీ లెట్టించీక పోతే నన్ను పేరుపెట్టి పిలకండి. మొగంమీద ఉమ్మియండి. అంతే! కాకపోతే కొంచెం పై మివ్వండి. మరొద్దు సార్!"


"నీ సంగతి నాకు తెల్దేటి? ఓసి మరికసిం తుచ్చుకోవయ్యా? దీనికి నిమిషేటి?"

"ఇదే మోతాదు పదున్నారే! దాటీసినామా —సూపరెంటు నాయాలో సరస మాడేసి— పీకలమీదికి తెచ్చుకుంటాను. అందులోనూ ఎన కటకోపాలి జెల్లతినీసున్నాను గూడా! మరొ స్తానుసార్! మీరు సెలవిచ్చిన పనిమీదే ఉంటాను. రిబ్బను మీరు కత్తిరించాలి. ఒస్తాను సార్."

అలికిడి చచ్చిపోతోంది. అప్పుడే యేడు రోడ్ల జంక్షను దగ్గర జనం పల్చబడుతున్నారు. అక్కడక్కడా కలక్టరేటు శాల్తీలు, జిల్లా పరి షత్ పార్కులూ, హైస్కూలు శవాలూ సెలవు తీసుకొనే ముందు జరిపే తుదికాండను శాస్త్రో క్తంగా జరిపిస్తున్నారు.

"శ్రీకాకుళం అయిపోయింది గాని—ఇదే విశాఖపట్నంలో అయితేనా—ఈ టైములో యేం కలరు! ఏం బ్యూటీ!! ఆ సగం సంగ

రొమ్ములూ—ఆ మెరిసె పొట్టకింది భాగాలూ, మత్తెకించే బాహుమూల సౌందర్యాలూ, చిచ్చు రేపే చిర్నవ్వులూ, ఎదీ, మనూళ్ళో మచ్చు కొకటైనా పేల్తాయా? అబ్బే! ఎంతసేపు నుంచున్నా—కిందటి నెల పాస్‌చేసిన సప్లిమెంటరీ బిల్ మామ్మూలింకా అందలేదని అఘోరించే 'సి' సెక్షన్ క్లార్కూ—అమ్ముకున్న సిమెంటు పర్మిట్లలో తన వాటాకేమీ పెద్దగా మిగల్లేదని ఏడ్చే రెవిన్యూ యిన్‌స్పెక్టరూ—ఫెంత్‌క్లాసు వెధవలు తన దగ్గరికి రాకుండా ఏడవకు—ఉన్నదాంతో తృప్తిపడూ అంటారా పెద్దలు? నే నిప్పుడు పెద్దల్లో కలిసిపోయానా అని దాకలా నోరు తెరిచీసి ఆశ్చర్యపడిపోకు. మూడు ముళ్ళూ పడితే నువ్వూ అంతే! మనకి వేడెక్కడంలేదని మనం గోలపెడుతుంటే—అది చల్లారే దారి దొరక్క విశాఖపట్నం పురుగులు ఏడుస్తున్నాయట. మా కబీను తడిసిపోయిన ఉత్తరాన్నే సింబాలిక్‌గా పోస్టు చేశాడు. పిండితే నాగావళికి వరదలొస్తాయేమోనని మానీసేను. అందువల్ల-వాడెవడో ముళ్ళపూడి రమణ



రామారావు దగ్గరికి దాటేస్తున్నారని కుళ్ళే ధర్మారావూ—యీ మగ కంపే కదా!" అని సెలవిచ్చినవాడయినాడు — ఆరోసారిగా ఆరిపోయి అల్లరి పెడుతున్న అప్పు సగరెట్ని పారేస్తూ—రమణమూర్తి.

"ఒరే మావా! మనమ్మ మనమ్మేనా! అందుకేమైనా అభ్యంతరమా? లేదు కదా! అలానే మన శ్రీకాకుళం కూడా! ఒప్పుకుంటావా? లేదని

చెప్పినట్టు మనూరు చుట్టూ గోడలు కట్టించి సైనా సరే—యింతకంటె పెరక్కుండా చూసుకోవాలి. అలా పెరక్కుండా చూస్తా నన్నవాడికే ఓటెయ్యాలి. లేకపోతే రేప్పొద్దున్న మన గుంటలు మన్ని తిడతారు. అదలాగుంచు గాని—నీకు పెళ్ళిపెటాకులు లేవు. ఇప్పట్లో అయే శకునాలూ కనిపించడంలేదు గాని నాకు పెళ్ళయింది. మా ఆవిడ చాలా పతివ్రత గాబట్టి వేళపట్టున గూడు చేరుకోవడం అవసరం. అందుకని—ఒరే మావా—మనం బయలు దేరుదాం. తెల్లారాక యిద్దరికీ తొందర తొందర మింగుళ్ళూ—బస్సు ప్రయాణాలూ— పైథాగరస్ సిద్ధాంతాలూ—పెద్ద మేష్టరితో యింక్రిమెంట్ల తగువులూ—వాడి బనీనుమీద ప్రబంధాలూ ఉండనే వున్నాయి. మనవీ మరీ అడుగు అందని బతుకులు కానందుకు సంతోషిస్తూ—కావాలంటే ఓ పెగ్గు కాఫీవే సుమా—మా ఆవిడ యింటిదగ్గరే ఉంది, పోలీసు కుక్కలకి పాఠాలు చెప్తుంది—పట్టించేసి పోదాం. మరి నడు" అంటూ కదిలాడు వైకుంఠరావు.

"మేష్టర్లు" అని నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు కామరాజు.

"ఈ ఊర్ని విశాపట్నం సెయ్యడం మన తరం గాదుగదా! మన మనవడి తరం కూడా కాదు. కాని మనం దీన్ని పార్వతీపురమన్నా సెయ్యలేకపోతే సిగ్గు సిగ్గు. ఇంత పోలీసు బతుకూ బతికి నాలుక్కంపెనీలైనా లేనూళ్ళో పంజేయడమా? జాతోడెవడైనా యింటే నోట్లో గడ్డెడతాడు. దానికి బదులు రిజైనిచ్చేసి—ఒక సారాకొట్టూ—రెండు కంపెనీలూ పెట్టుకోవడం మర్యాద. జనాలు హర్షిస్తారు. మరైతే మదుపు గావాల. పోలీసోడిది పూట బత్తెం, షల్ల ఎలుగూ అని ఎనకటి కో పార్టీ శాపమెట్టేసినాడంట! మనం ఎనకేసిందంటూ ఏటీ లేదు మరెవడిస్తాడు? ఇక్కడి కాలేజీ గుంటలూ—కుర్రోళ్ళ సంఘాలూ—అంతా సవటల్లాగే ఉన్నారు. ఆంధ్రరాష్ట్రానికి అగ్గికీ బుగ్గికీ సమ్మెలు చేస్తారుగాని—మా ఊరికో కాబరే హోటలూ, రెండు బార్లూ, ఓ అరడజను కంపెనీలూ కావాలని చెయ్యరేం? మేమూ ఓ దెబ్బ కాతుమే! అబ్బ! దేశాని కేటిగావాలో ఎవుడికీ తెలీదు. బాగుపడూ అంటే యేటి బాగుపడతాది? కొడుకు కొజ్జా ఎదవయ్యాక—మనవల్ని కనూ కనూ అంటే కోడలుగుంటేటి కంటాది? అంతగా మనవలుగావి గావాలంటే అత్తముండే దారి సూపాలగాని. ఏటో!....హైమవతంది. రాత్రల్లా కునుకన్నది లేకుండా కాసుకు తిరిగినా కాండబ్బులు దొరికిసావవీ వూళ్ళో! దరిద్రగొట్టెదవూరు! ఎంతసేపూ లైటులేని రిక్షావోళ్ళూ, ఎమ్మీకుర్యాగాళ్ళూ దొరుకుతారు. ఆళ్ళకాదేటని తడువుకుంటాం— ఎన్నాళ్లు తడువుకుంటాం? తీరా జేసిగాని ఆళ్ళు మన కాళ్ళమీద పడితే—ఆళ్ళకి తిరిగి మనమిచ్చుకోవాల. అయినా తలుపులు తిన్నమ్మికి అప్పడాలే టాగుతాయి? ....పక్కింటి పిన్నిగారమ్మాయి మొన్నట్నుంచీ మా చెడ్డదిగా చూస్తంది. ఇంటిది పురుట్నుంచొచ్చేలోగే ఓ వట్టు పట్టేయాల. అంటె జాకెట్టు గుడ్డతోనో, పవుడ్రుడబ్బాతోనో ముందుగా ప్రేమ మొదలెట్టాలి. అంటే యీ రాత్రికి నాలుగూ పాయల్డబ్బులు సేసుకోవాల! సూద్దాం. దేవుడేటంటాడో! ఆడి వాటా నైవేద్యం ఆడికి పారేస్తాంగదా! సాయం చెయ్యడా?"


ర ర ర

"వారానికో దొమ్మి, నెలకో మర్డరూ పేలని యిదీ టౌనే నంటావేటి కామరాజూ!" అనడిగారు హెడ్డు వెంకట్రావుగారు—మాదిల్ప సుందుగా వస్తున్న కామరాజుని.

"నా మనసులోని మాట మీరెలా పట్టేసేరు సార్! ఏటో అనుకున్నానుగాని—మీరూ పేగులు లెక్కపెట్టీగలరు సార్! మనది ఎనకబడిన జిల్లా అని పెద్దలేటి ఉట్టినే అన్నారా సార్! చెప్పుకుంటే కృష్ణా గోదావరుల్ని చెప్పుకోవాలిసార్! అసలా నీటిలోనే ఉందట సార్ పౌరుషం! అలవాటు పోకుండా దొమ్మీలూ—ఆనవాయితీ తప్పిపోకుండా కూనీలు—ఆహా!—ఏం అందమైన బతుకు సార్! పుడితే అక్కడి పోలీసోడై పుట్టాల. అటేడు తరాలవాళ్ళూ యిటేడు తరాలవాళ్ళూ

# రచయిత గురించి

పుట్టింది 1946లో-శ్రీగోవిందు రామమూర్తి, శ్రీమతి సీతమ్మగార్ల తొలిచూలు బిడ్డగా-శ్రీకాకుళం జిల్లా దూసి గ్రామంలో. ఉద్యోగిస్తున్నది లెక్కలు మాష్టారిగా, శ్రీమతి రాజ్యలక్ష్మికి భర్తగా, అరవింద్, మధురిమ, కమలాకర్‌లకు తండ్రిగా-రాజాం తాలూకా లింగాలవలస గ్రామంలో.



లెక్కలు చెప్పడం పుస్తకాలు చదవడం కబుర్లు పోగేసుకోవడం వ్యసనాలు. ఇద్దరు కృష్ణశాస్త్రిలన్నా పిచ్చి.

తొలి రచన "ప్రేమ-ద్వేషం" ఈ జ్యోతి ద్వారానే 1967లో వెలుగు చూసింది. ఇంతకు ముందొక్క-సారంటే ఒక్క-సారి మాత్రమే ఆంధ్రజ్యోతి దీపావళి కథల పోటీల్లో నా "ఆకలి"కి కన్సొలేషన్ బహుమతి లభించింది.

ఈకథకి ప్రత్యేక బహుమతి యిచ్చినందుకు జ్యోతి వారికి కృతజ్ఞుడ్ని. ఇది పాఠకుల మన్నన పొందాలని ఆకాంక్షిస్తున్నవాడ్ని.

---

తరిస్తారు. ఆ కొట్లాట్లేటి, ఆ కూనీలేటి, ఆ బ్రాందీ బుడ్లేటి, ఆ కోడి మాంసాలేటి, ఆ కొవ్వెక్కిన లంజలేటి? మొహం మొత్తియాల. సీ ఎదవబతుకు! నూతిలోని కప్ప బతకతంది! వంటింట్ల ఆడదీ బతకతంది. ఈ అడివిల మనమూ బతుకుతున్నాం. అంతే."

"సూడండోయ్! ఏటి సెప్పినా మన కామరాజ్ సెప్పాలని నే సుట్టినే అంటుంటానేటి? పార్లమెంటు కెళ్ళాల్సినోడు— పొరపాట్న చిన్న ఫిరాయింపైపోయి — పోలీసోడయిపోనాడు."

"ఒద్దుసార్! అంతపెద్ద పరుగులు ఒద్దు! అయినా మనలో సత్తువుండాలిగాని ఎందలుంటేటీ?"

"అంతేన్లే! మన గురుడిలాటోడు ఎందలున్నా ఒకటే! అయినా నాకు తెలకడుగుతాను—పోలీసోడికి రూలేటయ్యా? పెద్దలు సూపిన రాదారి నొగ్గేసి రూలు రూలంటే ఎలా సావడం? అలాగని కిందామీదా సూడకుండా ఒకటే దున్నుడయితే పెమాదమే! అందుకు మన అగ్నాతవాసమే సాక్షి! ఏటంటావు కామరాజూ! అయినా ఎద్దు ఒత్తిగిల్లదేటి? కసింత ఓర్చుకోవాల."

"అది పెగ్నకాదు సార్! మొగోడితనం అసలే కాదు."

"కామరాజూ!"

"మీరు కదలకూడదు సార్! మీరు కదిలితే—ఈశ్వరుడు కదిలినట్టే. మీరలా ఓ చిర్నవ్వు పారేసి కూకోండి. కడంది నాకొదిలేండి. మూర్తం వేళకి సరిగ్గారండి."

"ఎన్నాళ్ళకి ఫారెనిస్కీలా కిక్కిచ్చే మాటిన్నానయ్యా కామరాజూ. మాటంటే అదీ! అభయమిచ్చాను. కాని కళ్ళాలొదిలీకు."

"గుర్రం మచ్చికవాలేగాని— అవుండాలేటి సార్?"

ఓరి దున్నపోతు గాడిద కొడకా! గుర్రంలాటి గుంటని నాక్కుండా ఎగరేసుకు దొబ్బేద్దామనేనేటిరా యీ ప్లాను? నా మీదికి పోటీ కొచ్చి బతికుందామనేనేట్రయ్యా ఈ దౌర్జన్యం? కాసుకో నా దెబ్బ!"

కామరాజుని పంతులు సాదరంగా ఆహ్వానించాడు.

"పంతులూ! ఈ లాడ్జి పేరేటి?" గుమ్మములో నిల్చునే అడిగాడు కామరాజు.

"పేరా సార్! సీతారామా! ఏం సార్?" అర్థం గాకలా వుంది అడిగాడు పంతులు. తాటికాయలంత అక్షరాల్తో వున్న బోర్డు వీడి కళ్ళ కానలేదా? లేకపోతే వీడికి చదువు రాదా అని కూడా అనుకున్నాడు. అయినా అడిగింది పోలీసోడు గనుక సమాధానం చెప్పాడు. అలాగని పోలీసోళ్ళకి కళ్ళుండవనిగాని-వాళ్ళకి బోర్డులు చదివేపాటి చదువూ రాదని కాని పంతులు అభిప్రాయమా అని మీరు నన్ను నిలదీయకండి. ఆ వైనం నాకు సరిగ్గా తెలీదు.

"పేరు మాసెడ్డ బాగుంది పంతులూ! సీతా—రామ. ఒకరు పతివ్రత అయితే రెండో వాళ్ళు పెళ్ళాన్ని తప్పించి మరో ఆడదానికేసి సూడనివాడు. మా బేషుగ్గా వుందిగాని పంతులూ—అయితేటి మనది సీతల లాడ్జింగా? రాముళ్ళ లాడ్జింగా?"

"ఏం సార్?"

"అడిగింది ప్రశ్నయ్యా పంతులూ!" టెక్కుగా అన్నాడు.

"ఔను సార్! ఏమయింది సార్?" పంతులికి గాభరా అందుకుంది.

"ఇప్పటికేటీ కాలేదుగాని — నాకంటే ముందల యిందల దూరినారే—ఆళ్ళెవరయ్యా పంతులూ?"

"పార్వతీపురం సార్! భార్యా భర్తలు, ఏం సార్?" కంగారుడోసు పెరిగింది పంతులికి. నైట్ డ్యూటీకి ఎందుకొచ్చానా అన్నంత వరకూ అది హెచ్చింది.

"పార్వతీపురమా? భార్యా భర్తలా? రైట్! మరి మొగోడు పేర్రాసినాడా?"

"ఆఁ రాసుండాలి సార్! సార్ మాది పరువైన లాడ్జింగు సార్! పెరటి తోవలకి మా ప్రొప్రయిటరొప్పుకోడు సార్!"

"సూడు పంతులూ! ప్రొప్రయిటర్ల సంగతీ పోలీసోళ్ళ సంగతీ నాకు సెప్పకు. ముందు ఆ మొగోడి పేరేటో అది చూసి సెప్పు."

"ఇదుగో సార్! రూం నంబరు 4 సార్! ఆ పేరు అప్పల్నాయుడు సార్! మధ్యాహ్నం ఒంటి గంటకి వచ్చారు సార్! ఏం సార్? వాళ్ళేమైనా......" కంగారూ, భయమూ జోడింపుగా నసిగాడు పంతులు.

"అయితొక్కపాలి పదమా! ఆళ్ళని సూడాల...." కదిలాడు కామరాజు.

కామరాజు వెనకబడి—"వాళ్ళు మర్యాదస్తుల్లాగే వున్నారుసార్" అన్నాడు పంతులు-కాదు—అనేసేడు పంతులు— ఈ మాట అనొచ్చో అనకూడదో అని జడుస్తూనే—"మర్యాదస్తుల్లాగా కనిపిస్తాన్నరను పంతులూ! సరిపోద్ది. అలా కన్పించినంత మాత్రాన ఆడు మర్యాదస్తుడే ననేస్తే ఎలాగయ్యా పిచ్చిబేమ్మడా? నీకన్పించిందానికీ నిజానికీ మధ్య బోల్డంత వారా వుంటాది. అది పోలీసోడ్ని నాకెరిక. ఎవుడు మర్యాదస్తుడో నేను చెప్పలేనుగాని—పంతులూ—ఎవుడు కాడో చూసీ చూడగానే నేను పోల్చగలను. మా కళ్ళకి ఆళ్ల సరిగ్గా ఆనతారు. మా కళ్ళు తప్పలేరు పంతులూ? అసలిది గుర్తుంచుకోవయ్యా! అనుమానం ముందల పుట్టి—ఆ ఎనక పోలీసోడు పుడతాడు."

మెట్టుకి మెట్టు ఎక్కుతూ—మధ్య మధ్య ఎఫెక్టు కోసం ఆగి వెనక్కి తిరుగుతూ—పోలీసుల జన్మరహస్యాన్ని సందేశించాడు కామరాజు.

"నిజవేగాని సార్...."

"పంతులూ! సీతా, రాముడూ పుట్టిన దేశమయ్యా మంది! అలాటిళ్ళాటిదీ — అల్లాటప్పాదీ గాదు." మెట్టెక్కుతూ వెనక్కి తిరిగి చూడకుండా అన్నాడు.

"ఎంత మాటసార్! పంతులికి నేర్పాలా!"

"ఈ దేశంలో ఆడోళ్ళు సీతల్లాగా—మొగోళ్లు రాముళ్ళాగా వుండాలనే పెద్దలు రామాయణం రాసేరు పంతులూ!"

ఈ గాడిదకొడుకు రామాయణం గురించీ అది రాయడంలోగల పరమార్థం గురించీ పురాణం చెప్పేవాడిలా మాటాడుతున్నాడేమిటా అనిపించింది పంతులికి. అసలా ప్రస్తావన యిప్పుడెందుకూ అని కూడా అనిపించింది.

అయినా "నిజవే సార్!" అన్నాడు—రామాయణం అర్థం తనకీ అవగతం అయిపోయినట్టు.

"ఈ దేశంలో ఆడది తల్లి పంతులూ! చెల్లి పంతులూ! లూకాయి లూకాయిది గాదు" మేడెక్కడం పూర్తయాక— వెనక్కి తిరిగి చూస్తూ అన్నాడు.

"ఔన్సార్" అని అన్నాడు—చివరి మెట్టు మీంచి పంతులు.

ఆగి—నుంచొని — నెమ్మదిగా — గంభీరంగా—"అలాటాడది యివాళేటి సేస్తంది పంతులూ?" అన్నాడు.

"కరక్టే సార్."

"ఏటి కరెక్టయ్యా పిచ్చి బేమ్మడా! నా కొచ్చినేటి? నీ జవాబేటి? అలాటాడది యివాలేటి సేస్తంది? తన ఒళ్ళమ్ముకుంటుంది. మన పరువూ అమ్మేస్తంది. ఔనా?"

ఈ ఒళ్ళమ్ముకోడం అన్నది యివాళ ప్రారంభం అయిందా? లేక రాముడి నాటినుంచీ వుందా? అనడగాలనిపించింది పంతులుకి. ఐనా పోలీసోడితో రామాయణ చర్చెందుకు అనిపించింది. రామాయణ కాలంలో ఏం వున్నాయో ఏం లేవో మనకేం తెలుసు? అయినా మనకెందుకవి? మనకాలం ఎలాగేడుస్తోందో అది చూసుకోక అని తనకు తను సమాధానం చెప్పుకున్నాడు. రామాయణ కాలంలా యివాల్టి ప్రపంచం ఉండదు. ఇవాల్టి దృష్టితో అప్పటి పరిస్థితుల్ని చూడకూడదు అని కూడా అనుకున్నాడు.

ఇలా పంతులు అనుకోవడాలూ—సమాధానం చెప్పుకోవడాలూ కొనసాగిస్తుండగా—నాలుగడుగులు నడిచి 4 వ నెంబరు రూమ్ చేరి పంతులుకేసి చూసి—ఫర్వాలేదు అన్నట్టుగా నవ్వేసి తలుపు మీద చెయ్యివేసి—

"పంతులు! అడిస్తాను అలా నించో! నీ బుద్ధి మంచిదయితే నీకుగాని, మీ లాడ్జికిగాని ఏటీగాదు. నేనుహామీ. పెళ్ళయిందా?" అన్నాడు కామరాజు!

"నాకా సార్! లేదుసారింకా. ఏం సార్!"

"అ ప్ప ల నా యు డు బాబూ! తలుపు తియ్యిమీ!"

"అసలేమయింది సార్?"

"కసింత బేగి తియ్యవయ్యా బాబూ! సిన్న పనున్నాది."

"ఎవరు మీరు?"

"ఎడ్రసు గావాలా అప్పలనాయుడుబాబూ! సరే రాసుకో! పోలీసోడ్ని. సాలా? పేరు కామరాజు. సరిపోద్దా? నీదేగాని పార్వతీపురం అయ్యుంటె యీ యివరాలు సాలు ఏటి?"

"మాష్టారూ! తలుపు తియ్యండి."

"తీసెయ్యండి! మీరు తీస్తారా? నేను తియ్యనా?" లోపల్నుంచి ఆడగొంతు సన్నగా.

"పంతులూ! ఇన్నావా?" అమందానందంగా అన్నాడు కామరాజు.

అది విన్నిగారమ్మాయి గొంతు మాత్రం కాదు. దాంది బండగొంతు. మాటలూ యాసగా వుంటాయి. అంతేగాకుండా — తన పేరు విన్నాక గూడా తలుపు తియ్యమందంటే అసలేగాదు.

మరెవరు?

"ఒచ్చింది మన చుట్టపోడు గాడు. పోలీసోడు. ప్రెమాదాం" మరీ మెల్లగా మగగొంతు.

"అది మాత్రం నిజం నాయుడుబాబూ! ఆలీసెమవుతున్నకొద్దీ ప్రెమాదం రేటూ ఎక్కువై పోతుంటాదిగాని బేగి త లు పు లు తీసీ."

"తీసెయ్యండీ!" పకడ్బందీగా ఆడగొంతు.

"పీక పోతుంది తెల్సా?"

"పోతే పోనివ్వండి.... మీరు, తియ్యరన్నమాటేనా? అయితే అడ్డు లేవండి. నేను తీస్తాను."



"నా మాట వినవేమీ?"

"వినకపోయుంటేనే బాగుండేది. వినీ—నమ్మీ యింతకు తెచ్చుకున్నాను. లెండి. నన్నొదలండి."

"సూడూ! నన్ను రక్షించవూ!"

"నా కాళ్ళు పట్టుకోకండి. నాకసహ్యం. వదలండి."

"ఆడకూతురు తీసేమంటుంది గదయ్యా! మరి సూస్తావేటింకా?" నిబ్బరంగా అన్నాడు కామరాజు.

అతని మనస్సు యిప్పుడు పూర్తిగా కుదుట బడింది. ఆ అమ్మాయి యెవరైతేనేం, పిన్నిగారమ్మాయి మాత్రం కానేకాదు. అంత వరకూ నమ్మకం. అయితే వ్యవహారం చూస్తుంటే భార్యాభర్త కూడా కానట్టుంది. కొంచెం కష్టపడితే జులుం చూపిస్తే ఏమైనా రాలడం తథ్యం. కాకపోతే ఓ వూపు ఊపాల! అదో పెద్ద విద్యగాదు. పుట్టుకతో వచ్చిందే. లేచిన వేళ బాగుంది అనుకున్నాడు.

"మరి నువ్వు తలుపు తియ్యవన్నమాటే నేటయితే?" వృత్తి సహజమైన గాంభీర్యత తోనూ సహజంగానే రేగిన కొంచెం కోపం తోనూ గట్టిగా అరిచాడు కామరాజు.

"చూడండి. మీరెంత బతిమాలుకున్నా కావాల్సిన అల్లరి ఎలాగూ కాకమానదు—తలుపు తీసెయ్యండి."

"అదీమాట. లేకపోతే తలుపు బద్దలు గొట్టించాల్సి వుంటుందంతే."

"సార్ సార్! అప్పలనాయుడుగారూ, కొత్త తలుపులు. మీపుణ్యముంటుంది. తలుపు తియ్యండి బాబూ! ఇప్పటికే ప్రొప్రయిటర్ చేత బండెడు చీవాట్లు తినాల్సి వుంటుంది. కర్మ."

అప్పలనాయుడు అతి నెమ్మదిగా తలుపులు అర తెరచి-డెస్డిమోనాని చంపేసాక ఒథెల్లో పోజులో కాకపోయినా దిగాలుగా దివాలాగా నుంచున్నాడు.

ఒక్క చూపుతో సిట్యుయేషన్ని సర్వే చేశాడు కామరాజు.

నిఖార్సయిన దోషిలా అప్పలనాయుడూ—

నిజమైన రిలీఫ్‌తో మెరిసే కళ్ళలో రేగే తడితో ఆ అమ్మాయి—

కామరాజుకేసి—కామరాజు యూనిఫారం కేసి చూస్తూ.

"ఇప్పుడు సెప్పు తమ్ముడూ! ఏ వూరు మంది?" రెండో చూపుతో అతడ్ని తినేస్తూ అడిగాడు.

"జమానుగారూ! మరేటంటే...."

"నీ పేరు అప్పల్నాయుడు గాదు. నీది పార్వతీపురమూగాదు. ఆ అమ్మాయి నీ భార్యా కాదు. నిజాన్ని రానీ. నాకిదే పనికాదు. నాకు అబద్ధమంటే మాసెడ్డొళ్లు మంట. రానీ బేగీ."

"అదిగాద్సార్ జమానుగారూ...."

"నాన్పుడు బేరం మరొద్దన్నాను. తమ్ముడూ నాలుగు ముక్కల్లో సెప్పాలంటే సెప్పూ. లేదూ స్టేషన్కి నడు. అక్కడ మా ఎడ్డు నీ తాతలాటోడి సేతైనా నిజం సెప్పిస్తాడు. ఆడి దెబ్బ పడితేగాని నీ నోరు పెగిలేట్టు లేదు. పద పద. పోలీసోడిది ఎదవబతుకై పోనాది. ఒక్క నాయాల మర్యాదగా నిజం సెప్పడు గదా!"

"మాది కొత్తూరు సార్! నేనక్కడ హైస్కూల్లో టీచర్ని." చాలా గాభరాగా వురి తీస్తారేమో లేకపోతే అన్నంత తొందరగా— ఆ రెండు ముక్కలూ జార్చేసేడు.

"ఏటీ?" నిజంగా దెబ్బ తిన్నట్టు అడిగాడు కామరాజు.

మేష్టరన్నవాడు అంతపని చేస్తాడనో— చెయ్యడానికి సాహసిస్తాడనో అతనూహించ లేక పోయాడులా వుంది పాపం.

"అసలు...."

"ముయ్ నోరు. శివ శివ. తెల్లారి లెగిసి ఎంత పాపపు మాట విన్నానయ్యా పంతులూ! నా కొడకా! నేను టీచర్ని అని ఎంత సులాగ్గా సెప్పేసినావు? సిగ్గూ శరమూ లేవేం? సూడు! నిన్ను మాత్రం ఒగ్గేదిలేదు. మేష్టర్లూ! మీరూ లాడ్జీలు పడతన్నారా? పంతులూ మరీ దేశం బాగుపడదుగాక పడదయ్యా! కావాలంటే నోటుముద్రమీద రాసిస్తాను. ఏయ్ నాయుడూ! అప్పలనాయుడివో, అత్తలనాయుడివో గాని మరి నువ్వేటి సెప్పినా నేను యినిపించుకోను గాక యినిపించుకోను. పద. ఊఁ పదా...."

అప్పుడు అప్పలనాయుడు—

మేష్టారు గాకపోతే పీడాపోయె!

కనీసం మనిషి కూడా కాదు.

అంతగా దిగజారిపోయి-పాతాళానికి కృంగి పోయి—

"సార్!" అని దీనాతిదీనంగా హీనాతి హీనంగా—నీచాతి నీచంగా—వేడుకోబోగా

"నేను యిననయ్యా! ఇ-ను-కో-ను అంతే" అని మాటోరుగా కదిలాడు కామరాజు.

"అదిగాద్సార్! సార్....సార్ ఇలాటి దెప్పుడూ అలవాటు లేదుసార్....ఇదే.... ఇదే మొదటిసారి....అందుకనిగాని...."

"అంటే....అంటే ఏటామాట? అహాఁ ఏటామాట కర్థమూ అని?" సర్రున లేచాడు.

"అహఁ.... అది కాదు సార్....ఈ అమ్మాయే సార్....ఈ అమ్మాయీ....మా అమ్మాయే సార్....అంటే.... అంటే మా వాళ్ళమ్మాయే సార్ .... మావాళ్ళమ్మాయే అంటే మా స్కూల్లో.... చదువుతున్న.... అమ్మాయ్సార్! ఏదో.... సరదాగా....సినిమా కని...."

"మేష్టార్జి నంగిరోడకు! నాకసలే మాచెడ్డ ఒళ్ళు మంటగున్నాది. మీ స్కూల్లో చదువు తున్న ఆడిపిల్లని మాయమాటలుచెప్పి లాడ్జింగుకి తెచ్చింది చాలక....ఏటి నీ ధైర్యం! అసలు ఏటి నీ ధైర్యమూ అని."

వెనకాల వున్న పంతులు అప్పలనాయుడి వీపుమీద గోకాడు.

ఏమిటన్నట్టు వెనక్కి చూసాడు అప్పల నాయుడు.

"చెయ్యి తడుపు .... చెయ్యి తడుపు" అన్నట్టు సర్వావయవాభినయం పట్టేస్తున్నాడు పంతులు.

"ఎంత?" అని సన్న చేసాడు నాయుడు.

"ఈ మాత్రం తెలీదూ కర్మ" అన్నట్టుగా తన నుదుటిమీద కొట్టుకున్నాడు పంతులు. వాటి రేట్ల వివరాలు ఏనాడో గెజిట్ పబ్లికేషను కూడా అయిపోయాయి గదా, ఇంకా నీవరకూ రాలేదా? అన్నట్టుగా ఈసడింపుగా చూసాడు కూడా.

ఆ తర్వాత— "ఎంతో కొంత యిచ్చేసి

ఒదిలించుకో! లేకపోతే చస్తావు" అన్నట్టుగా అభినయించాడు పంతులు. "పద పద" అన్నట్టుగానే "వేగం కానీవయ్యా దేవుడా" అన్నట్టుగానే అప్పలనాయుణ్ని ముందుకు తోసాడు.

ఈ తతంగాన్నంతా ఓ అరగంట గమనిస్తున్న కామరాజు మరింత బిగుసుకుపోయి—

"ఏటి?" అని హూంకరించాడు.

"పాతిక సార్" అని ఠకీమని అనేసి—

గబ గబా జేబులు తడిమేస్తున్నా డప్పలనాయుడు.

"పంతులూ ఓపాలి వక్కడు లెగు మీ" అని పంతుల్ని ఒక్క వుదటున పక్కకి లాగేసి—

"ఏటయ్యా ఏటన్నావూ? పాతికా: ఏటయ్యా పాతిక? అసలు పోలీసోడంటే ఏటనుకుంటన్నావేటి? అడ్డులే పంతులూ" అని దాదాపు కొట్టడానికెళ్ళినట్టే మీదికి వెళ్ళాడు.

అంత నిలువుశాస్త్రీ — మాష్టారప్పలనాయుడూ నిలువునా గజగజలాడిపోవడం గమనించిన పంతులికీ సముద్రాన్ని ముంచేంత నవ్వొచ్చిందిగాని రసాభాస అయిపోతుందేమోనని కాబోలు భయపడి పెదాల్ని బిగించేసుకుని నవ్వుని బంధించేసుకొని—పొట్ట గట్టిగా పట్టుకొని అప్పలనాయుడు మాష్టార్ని నీడ చేసిన చీకట్లోకి ఈడ్చుకుపోయాడు.

కామరాజు ఆ అమ్మాయిని మాటల్లో పెట్టేడు శాంతించినట్లుగా.

"నీకు బుద్దీ సుద్ది వుందటయ్యా నాయుడూ! చేసిన వెధవ పనికి సిగ్గుపడి గుట్టు చప్పుడు కాకుండా గప్‌చిప్‌గా పనయ్యే దారి చూసుకోవాలిగాని—ఇలాగేనా? ఇచ్చేది లంచంగదా! కాస్త చాటూ మాటూ వుండొద్దూ. చాలా బాగుందండీ! ఇదేం వేలంపాటా— పబ్లిగ్గా తెలీడానికి? మీ పరిషత్తు గుమస్తాలకి యిలాగే లంచాలిస్తున్నారేమిటి మీరు?" అని కాస్త కసురుకున్నాడు పంతులు.

"ఓసేటయిపోయిందండీ! అదేటోగాని— మా గుమాస్తాలకాడ మాత్రం సాటూ మాటూ లేవు సుమండీ! సచ్చిపోమూ! అయినా పోలీసోడేగదా—పెద్ద ఆఫీసరా ఏటన్నానా?" అని ఆఫీసరుకైతేనే కాస్త రహస్యంగా యివ్వాలిగాని తతిమ్మా అమాంబాపతు జనాల కెలాగిచ్చినా ఫర్వాలేదనే ఫక్కీలో అన్న అప్పలనాయుడికేసి సీరియస్‌గా చూసి—వీడో పనికిమాలిన వెధవన్నర వెధవ అని నిర్ధారణకొచ్చేసి—

"చాలు చాల్లేవయ్యా! మాంసం తింటున్నామని ఎముకలు మెళ్ళో వేసుకు తిరగవేం? కామరాజు అంటే నీకింకా తెలియదులాగుంది. చచ్చిన శవం దగ్గర్నుంచయినా తనకి రావల్సింది వసూలు చేసుకోగల గండలమిండడు. పాతికలకి, ఏభైలకి పడ్డు" అని కామరాజు విలువని వివరించాడు పంతులు.

"బాబ్బాబూ! బుద్ది గడ్డితింది. ఈ గుంట మా వూళ్ళోనైతే లొంగడం లేదని—పెళ్ళి చేసుకుంటానని చెప్పి తీసుకొచ్చినందుకు— నాకైంది పెళ్ళి. ఏభై లో సర్దుబాటు చేద్దురూ. పంతులుగారూ! సచ్చి మీ కడుపున పుడతాను" అని చేతులు పట్టేసుకున్నాడు.

"నీలాటి వెధవ నా కడుపున పుడితే ఇల్లల్లా కూడే" అని కాబోలు అనుకొని—

"లొంగి రాడయ్యా! అయినా మానవ ప్రయత్నం చేద్దాం" అని పంతులు మానవుడు కదిలాడు.

పంతులు పోకడల్ని ఓ కంట కనిపెడ్తున్న కామరాజు—

"ఏటయ్యా పంతులూ ఆ మంతనాలు? మేష్టర్నాకొడుకు స్కూలు పిల్లని మాయమాటలు సెప్పి తీసుకొచ్చి రేపు సేసీబోతాడూ? ఏటి పోలీసోళ్ళేటి గాజులు తొడిగించు కూర్చున్నారనుకుంటున్నావేటి? నిమిషంల ఉద్యోగం పీకించి పారేస్తాను. నా సంగతి తెల్దుకాబోలింకా! సమ్మిట్ మీటింగులు సాలుగాని బేగి రండి. పైమవతంది" అని గట్టిగా అరచి—

నెమ్మదిగా "ఈ తలమీదెన్ని ఎండ్రుకలున్నాయో అన్ని కేసు లిలాటివి సూసినాను తల్లీ! మొగోడ్ని మాత్రం నమ్మకూడదు.

ఉండు. ఆళ్ళను లాక్కొస్తాను" అని ఆ అమ్మాయికి చెప్పి—పంతులు వేపు కదిలాడు.

పక్కనున్న గోడకి కూడా వినిపించనంత నెమ్మదిగా — "ఏటంతన్నాడు?!...." అనడిగాడు.

"ఏభైలో సర్దమంటున్నాడు" అంతకంటె మెల్లగా పంతులన్నాడు.

"ఇదా నీ సాయం? కాయితమైనా లేకపోతే సాలొద్దా! అసలే మా హెడ్డుబాబు బకాసురుడు గదా? ఆవురావురనున్నాడు. ఆడికేటిస్తాను? మిగిలిన తొత్తుకొడుకుల కేటి పంచుతాను? నేనేటి తింటాను? కక్కూర్తి పడతన్నామంటే యెందుకు? ఆలోచించు. సూడు పంతులూ! నీగ్గాని—మీ ప్రొప్రయిటరుకిగాని—పైసా తగలకుండా ఉండాలంటే—పందకి సెట్ చెయ్యి. లేదంటే—ఆ కొరదా మీరు కలపాల! నీ యిష్టం" అని సరళంగా ఆదేశించాడు.

"ఓ పట్టుపడతానుగానండీ—ఆ వెధవ వినుకునేట్టు లేదే! అసలే కక్కూర్తి నాకొడుకులాగున్నాడు."

"పంతులూ! నువ్వు నడు. నీ పని నువ్వు కానీ!" అని మెల్లగా అనేసి—ఆ వెనక—గట్టిగా, భీకరంగా—"పంతులూ! ఆ మేష్టర్నిలా లాక్కురమ్మంటే—దయగియ అంటావేటి? ఆడేటి నీ సుట్టపోడా? మద్దెన నీ ఇదేటి? సెయ్యి సేసుకోడం యిష్టంలేగ్గానీ—నా సంగతి నీకు తెల్దా? మర్యాదగొస్తాడో మరేటి సెస్తాడో అడుగు. అసలే సికాకుగుంది నాకు. నేను ఏ డెక్కిపోతే సచ్చూరుకోగల్డు" అని అరిచాడు.

ఈలోగా పంతులు—అప్పలనాయుడ్ని చేరుకొని-తనేం చెయ్యలేననే ఫోజులో—"లాభం లేదయ్యా! పాతికా, యాభయ్యా అంటే వాడు వినిపించుకోవడం లేదు. సరిగదా—చూసావా నన్నే కసురుతున్నాడు....పద, పద. నీకు మత ప్రవేశం రాసిపెట్టుంటే నేనేం చెయ్యగల్ను?" అని భుజంమీద చెయ్యి వేశాడు.

"పంతులూ! ఇలాటి యవ్వారాలు నాకు కొత్తగనుకగాని....సరే—బాబ్బాబూ! ఎంతైతే ఒగ్గేస్తాడో సెప్పు. మరేటి సేస్తాం? ఏ జెన్మల అచ్చున్నామో?"

"రెండువందలకి పైమాటైతే మాటాడ మన్నాడయ్యా! లేదంటే నోర్మూసుకొని తనతో స్టేషన్కి రమ్మన్నాడు. మరి నీ ఇష్టం. ఉద్యోగస్తుడివి కూడానూ."

"అందుకేగదా! నాయన్నాయినా! అంతిచ్చుకోలేనుగాని—పంతులూ—నాకాడ వందున్నాయి. ఈ పాలికి సర్దుకోమను. కాదూ కూడదూ అంటే జీతాలందాక సర్దుబాటు చేస్తామని చెప్పు."

"ఇన్స్టాల్మెంట్లకి పోలీసోడు పడతాడటయ్యా? చూడూ! అమాయకుడిలాగున్నావ్—అందులో ఉద్యోగమోటి వెలగబెడుతున్నావు—యేం ప్రమాదమో యేం పాడో అని జాలిపడి మాట సాయం చేయబోయానుగాని - నేనేం బ్రోకర్నటయ్యా—మీ యిద్దరిమధ్యా గానుగెద్దులా తిరగడానికి? మీరూ మీరూ యేం పడతారో పడండి. మధ్య నా కెందుకీ గొడవ? నేను పోయిపడుకుంటాను" అనేసి ముందుకు కదిలాడు.

కదిలిన పంతుల్ని భుజంపట్టుకు ఆపేసి—మాటాడకుండా జేబులోంచి డబ్బు తీసి—15 పదికాయితాలు లెక్కపెట్టేసి —తోసేస్తున్న పంతులి చేతుల్లో బలవంతాన పెట్టేసి—గుడ్ల నీరు నింపుకొని—"పంతులూ! ఇదిగో! ఈ పదీ మిగిలినాయి. ఇంటికెళ్ళాలి గదా? సాలొద్దా? ఎలాగో ఈ పాలికి సర్దీవా? లేకపోతే పీకెగిరిపోతాదిగదా? నీ మేలు జన్మ జన్మలకి మర్చిపోతానేటి? దయలేదా? ఇల్లు నిలబెట్టవా?" అని యేడిచేసాడు—వలవలా — అప్పలనాయుడు.

"సరే! నా తిప్పలు నేను పడతాను గాని—వెనక్కి తిరిగిచూడకుండా పారిపో! ఊఁ!" అని పంతులనేసరికి—అప్పలనాయుడు — కింది మెట్టుమీదున్నాడు.

కామరాజు తన దగ్గరికి వచ్చేలోపుగానే—కొన్ని కాయితాలు తన జేబులో దోపేసుకొని—కామరాజు రాగానే—మిగిలినవాటిని అతని జేబులో తోసేసి—"ఏడుస్తున్నాడు సార్! పాపం! పోనిద్దురూ! ఎక్కడికి!" అని దయ

చూపించాల్సిన అవసరాన్ని గుర్తు చేశాడు.

కామరాజు మరి మాటాడకుండా—ఆ అమ్మాయి దగ్గరకు వస్తూ—"హైకోర్టుకు పంపించి ఆరేళ్ళు చెప్పిద్దునుగాని—ఈ పాలికి ఒగ్గేసేను ఎదవని! ఏడుబ్బితెదవ!" అనే జనాంతిక ప్రకటనోటి జారీ చేస్తూ—అది సంజాయిషీగా ఎవరూ భ్రమపడరాదని అనుకుంటూ—"అయితే యింతకీ నువ్వేటంటావూ?" అని ఆ అమ్మాయిని అడిగాడు.

"నేనేం చేయనండీ! ఈయనేమో—అరసవిల్లి కోవేల్లో పెళ్ళాడతానని చెప్పి తీసుకొచ్చేసారు. తీరా యిప్పుడు యింటికి వెళ్తే మా నాన్నగారు చంపేస్తారు. పోనీ తెగించి వెళ్దామన్నా—ఛార్జీకి డబ్బుల్లేవు. ఏం చేయమంమంటారు?" అని అతడ్నే అడిగింది.

"ప్రతీ కుక్కలకొడుకూ డబ్బెట్టి పోలీసోడ్ని కొనీవచ్చు ననుకుంటాడు. కామరాజు సంగతి తెల్దింకా! ఎవుడో ఒక ఎదవ రూపాయ డబ్బులికి ఆశపడి లొంగిపోతే—ఓల్ మొత్తం పోలీసోళ్ళందరూ అంతేనా? ఎదవలేనా? మాకు మాత్రం సరదా యేటి? అందరూ జైళ్ళల కూకుంటె మాకు పండుగలాగుంటా దేటి? అయితేటి సెయ్యడం? మేం లాని కాపాడాల గదా? పోలీసోడి బతుకు కత్తిమీద సవ్వారీలాటిది. ఆడివతల లాని సూడాల. అవతల ప్రజల్ని సూడాల. ఎవళ్ని సూడకపోతే ఆళ్ళకే కోపం! నిర్దోషి శిక్షింపబడకూడదంటాది—లా. అలానే—దోషులూ బోరవిరుసుకు తిరగకూడదంటాది ప్రభుత్వం. ప్రతివోడూ తను తప్పించి మిగిలినోళ్ళందరూ దొంగలే నంటాడు. ఆళ్ళనెందుకు కొట్లతోసేవూ అనడుగుతారు? ఏటో! అంతా గందరగోళం—మాయాజాలం అన్నట్టుంది. ఇచిత్రమేటోగాని—మేం ఎంత జాగర్తగున్నా—యిటూ ప్రెజలూ నమ్మరు—కోర్టులూ నమ్మవు—మమ్మల్నిద్దరూ నమ్మరు. దీనికేటి సెప్తాం? డూటీకి కట్టుబడినాక నీలాపనిందలు భరించాల మరి" అని ప్రకటనయొక్క తరువాయి పూర్తి చేసి—

"చూడమ్మా! ఇది వూరేగాని అడివి కాదు. మేం మనుషులమేగాని మృగాలం కాదు. ఈ రాత్రికి మా ఆడదానికి సాయంగా మా ఇంట్లో తొంగో. తెల్లారి లెగసి మీ ఊరు పంపించేస్తాను. పెద్దోడ్నే, చిన్నోడ్నే ఓ మాట సెప్తున్నా నినుకో—తల్లినీ తోడ్నీ ఒగ్గిసి ఇలా మరెప్పుడూ పారాకు. అయిపోయిందేదో అయిపోనాదిగాని—యికనైనా బుద్ధిమీదుండు. పద. నిన్నింటికాడ దింపీసి—నేను మళ్ళా డూటీకి రావాల" అని ఆమెను తోడ్కొని వెళ్ళాడు.

ర ర ర

'వసంతవిహార్' లాడ్జిలో గుర్రుపెట్టి పడుకున్న సింహాద్రినాయుడ్ని—రెండు కుదుపులతో లేపి—అతడ్ని ఆవలించుకోనిచ్చి—

"నాయుడుసార్! గౌరమ్మ కంపెనీకి కొత్త పిట్ట వొచ్చి పడ్డాది. మా గనంగా ఉన్నాది గుంట. ఇప్పటికింకా యెవరూ మూసూడలేదేమో—పిటపిటలాడిపోతన్నాది. మీదే బోణీ. మరి లెగండి. అప్పుడే సగం రాత్రి ఐపోనాది? సూసినారా? కామరాజంటే ఏటో అర్థమైనాదా. మాటిచ్చిన్నాను—గంటల్లో మాట నిలబెట్టుకొన్నాను. మరి పదండి" అని తోలుకు వెళ్ళిపోయాడు.

గౌరమ్మకి నాయుడ్ని అప్పజెప్పేసి "సార్! దయుంచాల. తెల్లారి కలుస్తాను" అని సెలవు తీసుకొన్నాడు.